క్లుప్తంగా

అలరించిన దుర్యోధనుని వధ



తలపడుతున్న దుర్యోధన, భీమ పాత్రధారులు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో సమీపంలో ఉన్న శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. దుర్యోధనుడిగా కిరణ్, భీముని పాత్రధారిగా వేణునాథరెడ్డి అద్భుత ప్రదర్శన చేశారు. వందలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ నడుమ అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శ్రీద్రౌపదీదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వినతికి పబ్లిక్ గ్రీవెన్ రిడ్రెస్సల్ సిస్టంను సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండి సంబంధిత సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చే అవకాశం కల్పించారు.

చిల్లీస్ రెస్టారెంట్ నూతన బ్రాంచ్ ప్రారంభం



నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవంలో అంజికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న స్నేహితులు

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్లీస్ రెస్టారెంట్ నాలుగో బ్రాంచ్‌ని ఆదివారం చిల్లీస్ రెస్టారెంట్స్ అధినేతలు అంజి, అనిల్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థలను మరిన్ని విస్తరించి ప్రజలకు మరింత రుచి, శుచికరమైన ఆహారాన్ని అందించే ఉద్దేశంతో తిరుపతిలో నాలుగో బ్రాంచ్‌ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు.

మాక్‌డ్రిల్



అమ్మవారి ఆలయంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినప్పుడు, ఏదైనా అత్యవసర పరిస్థితులు వాటిల్లినప్పుడు ఎలా ఎదుర్కోవాలి ? భక్తులను ఎలా రక్షించాలి ? అనే విషయాలను మాక్ డ్రిల్ ద్వారా చేసి చూపారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని వివిధ ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వరంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్స్ నిర్వహించడం జరుగుతోంది. కార్యక్రమంలో వీజీవో నందకిషోర్, ఏవీఎస్ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత పండితులకు అవార్డులు



ప్రొఫెసర్ హయగ్రీవ శర్మను సన్మానిస్తున్న వీసీలు, పండితులు

తిరుపతి సిటీ: సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేసిన పండితులకు తగిన గుర్తింపు లభించింది. ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఉత్కర్ష మహోత్సవంలో భాగంగా ఆదివారం ఎస్వీయూ సంస్కృత విభాగం పూర్వ ఆచార్యులు హయగ్రీవశర్మ, సంస్కృత వర్సిటీ మీమాంస విభాగ ప్రొఫెసర్ సూర్యనారాయణ భట్‌లను ప్రాచ్య విద్యాభూషణ అవార్డులతో సత్కరించారు. ఈ అవార్డుతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని అందించారు. వీరు సంస్కృత ఆచార్యులుగా, మ్యాన్‌స్క్రిప్ట్‌లపైన, భాషాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

భద్రత అంతంత మాత్రమే



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత అంతంత మాత్రంగానే ఉంది. రుయా ఆస్పత్రి ప్రాంగణంలోకి అసాంఘిక శక్తులు చొరబడకుండా పటిష్టమైన భద్రత అవసరం. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలి. వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి. వైద్య విద్యార్థినిలు హాస్టల్కు వెళ్లే మార్గంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి. సెక్యూరిటీ సిబ్బంది కాపలా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ బి.చైతన్య, గైనకాలజిస్ట్, తిరుపతి



నమ్మకం కలిగించాలి



వైద్యులపై తరచూ జరుగుతున్న దాడులు మా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తున్నాయి. మహిళ వైద్యుల భద్రతకు ప్రభుత్వాలు తీసుకునే కఠినమైన చర్యలు, తీసుకువచ్చే చట్టాలు మాలో ఆత్మవిశ్వాసం పెంచాలి. ముఖ్యంగా అత్యవసర విభాగంలో పటిష్టమైన పోలీసు, సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయాలి. 36 గంటల పాటు కంటిన్యూ డ్యూటీ చేసే మాకు సరైన విశ్రాంతి గది, వాష్ రూములు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ సౌకర్యాలను తక్షణం ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ భవ్య, వైద్య విద్యార్థిని, స్విమ్స్

ప్రసూతి.. కొరవడిన వసతి

రాయలసీమ జిల్లాల నుంచి నిరంతరం ప్రసూతి వైద్యసేవల కోసం రోజు వారి వేలాది మంది ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని ఆశ్రయిస్తారు. అయితే అక్కడ రోగుల సహాయకులకు వసతులు కొరవడ్డాయి. దీంతో సహాయకులు మండుతున్న ఎండల నేపథ్యంలో ఆస్పత్రి బయట చెట్ల కింద, పార్కింగ్, ఫుట్‌పాత్‌లపై సేద తీరాల్సిన పరిస్థితి. ఆరుబయటే ఇంతటి కష్టాలు ఉంటే ఆస్పత్రిలో వైద్యసేవల పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది. గత ప్రభుత్వంలో రోగుల వెంట వచ్చే సహాయకుల సౌకర్యార్థం పురుషులు, మహిళలు వేర్వేరుగా వేచి ఉండేందుకు ప్రత్యేక వసతి గదులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవీ చాలకపోవడంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి సరైన వసతులు కల్పించాలని పేద ప్రజలు కోరుతున్న దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







ప్రసూతి ఆస్పత్రి ఆవరణల్లో నేలపైనే సేద తీరుతున్న రోగుల సహాయకులు

బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్





బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, బీసీ సంఘర్షణ సమితి నేతలు

తిరుపతి కల్చరల్: అత్యంత వెనుకబడిన బీసీల అభ్యున్నతిని కాంక్షించి వారికి రిజర్వేషన్లు కల్పించి ఆదుకున్న ఆపద్బాంధవుడు బీపీ మండల్ అని మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. బీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో బీపీ మండల్ 106వ జయంతిని పురస్కరించుకుని డీబీఆర్ రోడ్డులోని బీపీ మండల్ విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీసీ సంఘర్షణ సమితి నేతలతో కలిసి బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీహార్ మాజీ సీఎంగా, సంఘ సంస్కర్తగా వెనుకబడిక తరగతుల కమిషన్ చైర్మన్‌గా బీపీ మండల్ వ్యవహరించారని తెలిపారు. దేశ స్వాతంత్య్రం 1947లో వచ్చిన దేశంలోని 60 శాతం బీసీ వర్గాలకు నిజమైన స్వాతంత్య్రం 1990లోనే బీపీ మండల్ పోరాటంతోనే 27 శాతం రిజర్వేషన్లే కారణమన్నారు. నేడు బీసీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఉద్యోగులు, బీసీ వర్గాల పిల్లలు కేంద్రప్రభుత్వ సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు పొందుతున్నారంటే బీపీ మండల్ కృషి, అవిశ్రాంత పోరాటమే అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘర్షణ సమితి గౌరవాధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, కార్పొరేటర్ నారాయణ, అనిత, సాకం ప్రభాకర్, అశోక్ సామ్రాట్ యాదవ్, బీవీ కేశవులు, వాసు యాదవ్, రఫీ, వెంకటరమణ, రమణ, బాబు, అరుణ్ యాదవ్, పలువురు బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఎంపీ డాక్టర్ గురుమూర్తి, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ బీపీ మండల్‌కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

గిరిజనులకు న్యాయం చేయండి

తిరుపతి కల్చరల్: రేణిగుంట మండలంలోని చెంగారెడ్డిపల్లి గిరిజనులకు ఇంటి పట్టాలు ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటరత్నం తెలిపారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో చెంగారెడ్డిపల్లి గిరిజనుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సొంతిళ్లు వస్తాయని గిరిజనులు ఎంతో ఆశగా ఉన్నారని, నేడు ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడానికి రెవెన్యూ అధికారులు నిర్ణయించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెంగారెడ్డిపల్లి గిరిజనుల సమస్యలను అర్థం చేసుకుని వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం(ఎంఎల్) న్యూడెమోక్రసీ దళితుల పక్షాన నిలిచి న్యాయ డిమాండ్ల సాధనకు పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం ఐఎఫ్‌టీయూ నేత రుద్రగోపి మాట్లాడుతూ గిరిజనుల పక్షాన నిలిచి వారికి ఇంటి పట్టాలు వచ్చే వరకు తమ పోరాటం ఆగదన్నారు. చెంగారెడ్డిపల్లి భూ పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడిగా పి.వెంకటరత్నం, అధ్యక్షుడిగా హేమాద్రికుమార్, డి.గోవర్ధన్, కార్యదర్శిగా ముఖేష్, ఉపాధ్యక్షులుగా ఎం.రాజశేఖర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా హరి, ఫల్గుణ, విజయబాబు, సంపూర్ణ, రామలక్ష్మి, బాలసుబ్రమణ్యంను ఎన్నుకున్నారు.

వృద్ధాశ్రమానికి భూమిపూజ



వృద్ధాశ్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

భాకరాపేట : రంగన్నగారిగడ్డ సమీపంలోని శ్రీ కొల్లాపురమ్మ ఆలయ ప్రాంగణంలో వృద్ధాశ్రమానికి భూమిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి కుటుంబం రూ.6 కోట్లు వ్యయంతో నిర్మించే భవనానికి అతిథులు శనివారం భూమిపూజ చేశారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి కుటుంబం వృద్ధాప్యంలో ఎలాంటి ఆసరా లేని వృద్ధులకు దుస్తులు, ఆహారం అందించి వారికి అండగా ఉండేందుకు ముందుకు రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు. రూ.6 కోట్లు ఖర్చు చేసి 100 గదులు నిర్మించి 500 మందికి ఆశ్రమం కల్పించడం అంటే ఆషామాషీ విషయం కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యండపల్లె శ్రీనివాసులు రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు రేవతీరమణదాస్, వలసారెడ్డి వెంకటరెడ్డి, వలసారెడ్డి కృష్ణారెడ్డి, వలసారెడ్డి శివప్రసాద్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, సైకం జయచంద్రారెడ్డి, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి నవాబుపేటలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 1991–92లో ఏడవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పి తమ జీవితాలకు బంగారు బాటలు వేసిన గురువులను సత్కరించుకుని గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తిరుపతి తుడా: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో నాటి మధుర స్మృతులను పంపించింది. రేణిగుంట రోడ్డులోని జేబీఐపీజీసీ కాలేజ్‌కు చెందిన 2003–2005 ఎంబీఏ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో సమావేశమయ్యారు. నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. అప్పటి పరిస్థితులు, టీచర్లతో నడుచుకున్న పరిస్థితులను పంచుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. రాజమండ్రి, ధవళేశ్వరానికి చెందిన నర్తన నటరాజ నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా నర్తన గణపతి, ఇదిగో భద్రాద్రి, కదిరి నరసింహుడు, ధనశ్రీ తిల్లానా, తరంగం వంటి పాటలకు కళాకారులు నవ్య, కావ్య, సహస్ర, కౌశిక, శ్రీకరి, అక్షయ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్ వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

– ముస్తాబైన ఇస్కాన్ మందిరం



శ్రీకృష్ణుడి విద్యుద్దీపాలంకరణ కటౌట్లు

తిరుపతి కల్చరల్: లోకరక్షకుడైన జగన్నాథుడు శ్రీకృష్ణభగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో వెలసిన ఇస్కాన్ కమల మందిరంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇస్కాన్ మందిరాన్ని విద్యుద్దీపాలంకరణలు, శ్రీకృష్ణుడి ప్రతిరూపాలు, చిత్రపటాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. శ్రీరాధాగోవిందులను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద పోలీసు బందోబస్తు, ఇస్కాన్ సెక్యూరిటీ సిబ్బందితో పాటు ప్రత్యేకంగా ఇస్కాన్ మందిర వలంటీర్లను ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజామున 4.30 గంటలకు ఆలయంలో నిర్వహించే మంగళ హారతి, తులసి పూజ, నరసింహ కీర్తన, జపంతో వేడుకలు ఆరంభం కానున్నాయి. అనంతరం ఇస్కాన్ కమల మందిరంలోని శ్రీరాధాగోవిందులతో పాటు అష్టసఖులను వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చనున్నారు. ఉదయం 9 నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించనున్నారు. సాయంత్రం 4 గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం అత్యంత వేడుకగా నిర్వహిస్తారు. తర్వాత 6.30 గంటలకు ఇస్కాన్ ముందున్న టీటీడీ మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముఖ్య అతిథుల ప్రసంగం, శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్ట గురించి ప్రసంగ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 11 గంటలకు శ్రీరాధాగోవిందులకు అత్యంత ప్రత్యేకమైన, విశిష్టమైన మహా శంఖాభిషేకం చేపడతారు.





స్వామి వారి ప్రసాదాల స్టాల్స్, ఇస్కాన్ మందిరంలో భజన చేస్తున్న భక్తులు


ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఆయుర్వేద మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ జ్యోతి కుమార్

తిరుపతి తుడా: తిరుపతిలోని ఆయుష్ విజయ హాస్పిటల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించిందని ఆస్పత్రి అధినేత డాక్టర్ జ్యోతికుమార్ తెలిపారు. రాజస్థాన్ ఔషధాలయం ఉత్పత్తి చేసిన ఆయుర్వేద మందులను రోగులకు అందించినట్లు ఆయన చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులైన థైరాయిడ్, షుగర్, నడుము, మోకాళ్ల నొప్పులకు ఆయుర్వేద మందుల ద్వారానే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా 150 మందికి పైగా రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఫార్మసిస్ట్ సంఘం ఉపాధ్యక్షుడిగా భార్గవరెడ్డి



తిరుపతి తుడా: రాష్ట్ర ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ గుడిసె భార్గవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మద్దెల సురేష్‌బాబు ఆదివారం నియామక పత్రాన్ని విడుదల చేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్పీ నాగభూషణరావు, రూరల్ సీఐ సాధిక్ అలీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఏఎస్పీ నాగభూషణరావు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరి గురించి ఆరా తీశారు. గతంలో వారి నేరప్రవృత్తి, ప్రస్తుతం ఏమి చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గొడవలు, ఘర్షణల్లో పాల్గొనవద్దని, ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కొందరు రౌడీషీటర్లు భూకబ్జాలు, సెటిల్‌మెంట్లలో పాల్గొంటున్నారనే విమర్శలు ఉన్నాయని, అటువంటి వారు తీరు మార్చుకోవాలని సూచించారు. మరోసారి కేసు నమోదు అయితే తప్పించుకోలేరని చెప్పారు. కొందరు రౌడీషీటర్లు కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ సీఐ సాధిక్‌అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో సుధహా విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలను తిరుపతిలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని రత్నం గ్లోబల్ స్కూల్, సుధహా కిడ్స్, సోక్రటీస్ పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా గోపికల వేషధారణల్లో కృష్ణాష్టమి సంబరాలు జరుపుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడి ఇతివృత్తాంతాన్ని, విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ పండుగలు మన సంస్కృతికి చిహ్నాలని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను ఆచరిస్తూ భవిష్యత్ తరాలకు అందించడం నేటి తరంపై ఉందని వివరించారు.



సోక్రటీస్ పాఠశాలలో..



రత్నం గ్లోబల్ స్కూల్‌లో ..

ఇళ్ల స్థలాల సందర్శన



వడమాలపేటలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న చీర్ల కిరణ్ బృందం

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట, పాదిరేడు అరణ్యంలో కేటాయించిన ఇంటి స్థలాలను టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఉపాధ్యక్షుడు, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు మొదటి విడతగా 3,518 మందికి, రెండో విడతగా 1,701 మందికి మొత్తం దాదాపు 430 ఎకరాలలో 5,219 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను దాదాపు పూర్తి చేయడం జరిగిందని.. అయితే ఇంటి స్థలాల వద్ద అభివృద్ధి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే ఉద్యోగులంతా ఇంటి స్థలాలకు సంబంధించిన డబ్బులు చెల్లించామని, చాలావరకు ఉద్యోగి స్థలానికి సంబంధించిన హద్దులు, ప్లాట్ నంబర్లు చూపలేదని తెలిపారు. ఇప్పటికైనా టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన వడమాలపేట ఇంటి స్థలాల వద్ద అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ నిధులతోనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు, పార్కులు మొదలైన అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏర్పేడు వద్ద మూడో విడతలో ఇచ్చిన 4 వేల మందికి త్వరగా ఇంటి స్థలాలు కేటాయించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, కోశాధికారి గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్ వంకీపురం పవన్, మణికంఠ, కార్యవర్గ సభ్యులు ధరణి కుమార్, తేజస్విని, ఈశ్వర్ నాయక్, మురుగన్, భాస్కర్, భాస్కర్, ఉమా శంకర్, బాలకృష్ణ, గుణ, మస్తాన్ రావు , సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.